ఈరోజు (18) సిపిఐ(యం) ప్రెస్ కాన్ఫరెన్సులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావులు పాల్గొన్నారు. సమావేశ వివరాలను ప్రచురణార్థం పంపిస్తున్నాము.

– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి – 9490098000

# పోలవరంపై అసెంబ్లీలో చర్చించాలి
# హృదయ విదారకంగా గిరిజనుల దుస్థితి
# విద్యుత్ సవరణ బిల్లునూ తిరస్కరించాలి
# పునరావాసాన్ని గాలికి వదిలేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వం
# - సిపిఎం రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణలో శ్రీనివాసరావు

పోలవరం పునరావాసం, గిరిజనుల దుస్థితిపై అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించాలని, కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల బిల్లును తిరస్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఆదివారం విజయవాడ ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రక్షణభేరి పోస్టర్, పాటల సిడిని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్సిన కేంద్రం ప్రాజెక్టును గాలికొదిలేసిందని తెలిపారు. రాష్ట్రమూ గట్టిగా అడగడం లేదని విమర్శించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు ఏడు మండలాల పరిధిలోని 100 గ్రామాలు నేలమట్టం అయ్యాయని నిలువనీడలేని గిరిజనులు కొండలమీద, గుట్టలమీద అత్యంత దుర్భరమైన పరిస్థితుల్లో తలదాచుకోవాల్సి వచ్చిందని వివరించారు. కట్టుబట్టలతో గోదావరి గట్లపై ప్రజలు పరుగులు తీస్తున్న హృదయ విదారక ఘటనలు చోటు చేసుకున్నాయని, ప్రజల మాన ప్రాణ ఆస్తులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతోందనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి లేదని తెలిపారు. దీనిపై బిజెపి నాయకులు నోరు మెదపడం లేదని విమర్శించారు. మీ చావు మీరు చావండని కేంద్రమూ వదిలేసిందని తెలిపారు. వాళ్లు పెట్టిన కాంటూరు లెవల్స్‌కు మునుగుతున్న ఊళ్లకు సంబంధం లేదని అన్నారు. పునరావాసం కోసం రూ.35 వేల కోట్ల నిధులు అవసరం ఉందని, దీన్ని రాబట్టుకోవడంపై రాష్ట్రం దృష్టి సారించాలని సూచించారు. ఒకవైపు పోలవరం ప్రజలు మునిగి పోతుంటే ముఖ్యమంత్రి దానిపై మాట్లాడకుండా రాజధానిపై ముఖ్యమంత్రి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని తెలిపారు. ఆయనకు పోలవరం, ఆదివాసీల దుస్థితి కనిపించడం లేదని విమర్శించారు. వెంటనే పోలవరం, గిరిజనుల దుస్థితి, పునరావాసంపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వాలని, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు వివరించాలని డిమాండు చేశారు. పునరావాసం, గిరిజనుల దుస్థితిపై చర్చించకపోతే అంతకంటే బాధ్యతారాహిత్యం ప్రభుత్వానికి మరొకటి ఉండదని తెలిపారు.

అమరావతి రాజధాని అని అన్ని పార్టీలూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశాయని, ఇప్పుడు అధికారంలోకి రావడంతో వైసిపి ప్లేటు ఫిరాయించారని తెలిపారు. రాజధాని వివాదానికి స్వస్తిచెప్పి రాష్ట్రాభివృద్ధిపై జగన్మోహన్‌రెడ్డి దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ధరలు పెంచారని, ట్రూఅప్ ఛార్జీలు పెంచారని, గతంలో 200 విద్యుత్ బిల్లు కట్టేవారు ఇప్పుడు నాలుగు వందల కట్టాల్సి వస్తోందన్నారు. ప్రజలపై భారాలు మోపే విధంగా సరఫరాను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు పార్లమెంటులో విద్యుత్ సవరణ బిల్లు పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం బిల్లును ఆమోదిస్తే ప్రజలకు అందాల్సిన రాయితీలు, సబ్సిడీలూ అందకుండా పోతాయని వివరించారు. రాజశేఖరరెడ్డి పెట్టిన ఉచిత విద్యుత్ పథకం జగన్మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలకు దూరమవుతుందని వివరించారు. డబ్బున్నోళ్లు కరెంటు కొనుక్కుంటారని, లేనివారు చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మండిపడ్డారు. ఒకవైపు ఉచితాలంటూ మరోవైపు ఉన్న పథకాలను ఎత్తేస్తుంటే కేంద్రాన్ని ప్రశ్నించకుండా రాష్ట్రం చోద్యం చూస్తోందన్నారు,. ఇప్పటికైనా రాష్ట్రానికి చిత్తశుద్ధి ఉంటే విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ఇప్పటికే తమిళనాడు, కేరళ, తెలంగాణా రాష్ట్రాలు ఈ బిల్లును తిరస్కరించాయని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ చీతాలను (చిరుతలు) విదేశాల నుండి దిగుమతి చేసుకున్నారని, దేశ ప్రజలమీద కూడా అలాంటి ప్రేమ చూపించాలని కోరారు. జిఎస్‌టి పేరుతో లక్షల కోట్లను ప్రజల నుండి వసూలు చేస్తున్నారని, వంటగ్యాస్‌ను రూ.400 నుండి రూ.1100కు పెంచారని తెలిపారు. నిత్యావసర వస్తువులు, బియ్యం, పాలమీద జిఎస్‌టి వేసి కేంద్రం ప్రజలను పీల్చిపిప్పిచేస్తోందని విమర్శించారు. కేంద్రం ఆదేశాల పేరుతోవైసిపి ప్రభుత్వం ఇష్టారీతిన పన్నుల భారాలు మోపుతోందని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయని వివరించారు. అసెంబ్లీ సమావేశాల్లో జగన్, వైసిపి గొప్పతనంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కాదని, ధరలపైనా, ప్రజల బాధలపైనా చర్చించాలన్నారు. శాసనసభకు అధికారం ఉండాలని చెబుతున్నారని, కానీ ప్రత్యేక హోదా, విభజన హామీలు, చట్టం అమలు చేయాలని గతంలో శాసనసభ తీర్మానం చేసిందని, దీన్ని కేంద్రం పట్టించుకోకపోతే జగన్మోహన్‌రెడ్డి నోరెత్తడం లేదని తెలిపారు. దీనిపై చిత్తశుద్ధి ఉంటే ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే రాజధాని, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి, ప్రత్యేక హోదా గురించి అసెంబ్లీలో మరోసారి తీర్మానం చేయాలని తెలిపారు. 27న హోమ్‌శాఖ విభజన హామీలపై సమావేశం ఏర్పాటు చేసిన నేపథ్యంలో అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి పంపించాలని కోరారు.

## రక్షణభేరి సభను జయప్రదం చేయాలి

కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్షణభేరి యాత్రలో భాగంగా 24వ తేదీన విజయవాడలో భారీబహిరంగ సభ జరుగుతుందని, శ్రీనివాసరావు తెలిపారు. దీనికి పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతున్నారని పేర్కొన్నారు. 14వ తేదీ నుండి 27 వతేదీ వరకూ దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ నడుస్తోందని వివరించారు. దీనిలో భాగంగా 23వ తేదీన పుట్టపర్తిలో బృందాకారత్, 26న కూనవరం, 27న విశాఖలో జరిగే బహిరంగ సభల్లో బి.వి.రాఘవులు పాల్గొంటారని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దేశ ప్రజలపై భారాలు వేయడం తప్ప ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రజోపయోగ పని చేయలేదని విమర్శించారు. లేబర్‌కోడ్లు, ధరలు పెంచడం వంటి చర్యలతో ప్రజలపై భారాలు వేసిందని తెలిపారు.

= = = =